క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని సబ్‌స్టేషన్ ఏఈఈ సురేష్ కుమార్ తెలిపారు. కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ తర్లువాడ, నగరప్పాలెం, గంటాపేట, ప్రకృతివానిపాలెం, గుడిలోవ, దుక్కవానిపాలెం గ్రామాల్లోని గృహ, వాణిజ్య, పారిశ్రామిక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న పెద్దలు

ఆనందపురం : మండలంలోని భీమన్నదొర పాలెంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి గురువారం స్థానిక సర్పంచ్ బంటు కుమారి, బంటు చిన్న దంపతులు భూమి పూజ చేశారు. సమరసత సేవా సమితి ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవాలయాన్ని నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు గీతల దేముడు, అక్కిరెడ్డి దేముడు, పినిశెట్టి సింహాచల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గీతం వర్సిటీతో స్మార్ట్‌జెన్ ఒప్పందం

కొమ్మాది: ఇంజినీరింగు విద్యలో వివిధ కోర్సులకు సులభంగా అర్థమయ్యేరీతిలో యానిమేషన్ వీడియో తయారు చేయడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంతో స్మార్ట్ జెన్ సంస్థ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తెలిపారు. ఇంజినీరింగు విద్యను యానిమేషన్ సహాయంతో బోధించాలనే నిర్ణయం సరికొత్తదన్నారు. ఈ ఆలోచన విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో స్మార్ట్ జెన్ సీఈవో నవీన్ గీతం రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డైరెక్టర్ డాక్టర్ రాజాఫణి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్నుల చెల్లింపునకు నేడే ఆఖరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని నాలుగు వార్డుల్లోని ప్రజలు ఇంటి పన్నులు, ఖాళీస్థలాల పన్నులు, కుళాయి పన్నులు వడ్డీ లేకుండా చెల్లింపునకు శుక్రవారం ఆఖరి రోజని జెడ్సీ బొడ్డేపల్లి రాము తెలిపారు. ఏప్రిల్ 1 తర్వాత చెల్లించే బకాయిలపై వడ్డీ మాఫీ ఉండదన్నారు. సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ఎండాడలో కారు బోల్తా



కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జాతీయ రహదారి నుంచి రుషికొండకు వెళ్లే మార్గమధ్యలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం సాయంత్రం ఎండాడ నుంచి వస్తున్న ఓ కారును ఎదురుగా వస్తున్న మరో కారు బలంగా ఢీకొట్టడంతో ఒకటి బోల్తా పడింది. అయితే ఈ సంఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పీఎం పాలెం పోలీసులు తెలిపారు.

కంచరపాలెంలో వ్యక్తిపై దాడి

మర్రిపాలెం: కంచరపాలెం సంజీవయ్య పార్కు దరి వెల్డింగ్ షాపు వద్ద ఇద్దరు వ్యక్తుల మధ్య బుధవారం వాగ్వాదం జరగడంతో పి.శ్రీనివాస్ తలపై కిరణ్ రాడ్డుతో కొట్టాడు. దీంతో శ్రీనివాస్ తలకు, చేతికి గాయాలయ్యాయి. చికిత్స అందించారు. తలపై బలమైన గాయమవడంతో 9 కుట్లు, చేతి మీద 2 కుట్లు పడ్డాయి. శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం కేసు నమోదు చేశారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం


పాత మూలకుద్దులో సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


సంతపేట రామాలయంలో అలంకరించిన 500 ఏళ్ల నాటి సీతారాముల విగ్రహం


ఇస్కాన్ మందిరంలో సీతారాముల ఉత్సవమూర్తులు


వారీజా ఆశ్రమంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు


పీఎంపాలెంలో సీతారాములకు ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న రోశిరెడ్డి దంపతులు

తగరపువలస: శ్రీరామనవమి సందర్భంగా గురువారం పలు రామాలయాల్లో సీతారాముల కల్యాణం కన్నులపండువగా సాగింది. భక్తులే పెద్దలుగా వెంటరాగా అర్చకులు శాస్త్రోక్తంగా ముఖ్యమైన 35 ఘట్టాలతో పెళ్లి వేడుకలు జరిపించారు. గణపతి పూజ, వరపూజ, యజ్ఞోపవీతధారణ, మదుపర్కాలు, కన్యాదానం, కాళ్లు కడగటం, సుముహూర్తం, మంగళసూత్రధారణం, తలంబ్రాలు, బ్రహ్మముడి, అంగుళీయకాలు తీయడం, అరుంధతి నక్షత్ర దర్శనం, అంపకాలు తదితర ఘట్టాలు మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ జరిపించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయంతోపాటు సంతపేటలో 500 ఏళ్లనాటి భద్రాద్రిని పోలిన విధంగా ఏకశిలలో దర్శనమిచ్చిన సీతారాముల విగ్రహాలు అలంకరణలో భక్తులను అలరించాయి. పానకం, వడపప్పుతోపాటు మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. తగరపువలస మెయిన్‌రోడ్డు, సంగివలస కాలనీ, వలందపేట, జీరుపేట, సంతపేట రెడ్డివీధి, కుమ్మరివీధి, తాళ్లవలస, చిట్టివలస, తాటితూరు, నమ్మివానిపేట, నిడిగట్టు, పాత మూలకుద్దు, కొత్త మూలకుద్దు, టి.నగరపాలెం, చిల్లపేట, కృష్ణంరాజుపేట, చిప్పాడ, పాతపాలెం, సత్యనారాయణపేట తదితర రామాలయాలు రామనామంతో పులకించిపోయాయి.

పీఎం పాలెం: స్థానిక రెండో బస్టాపు సమీపంలోని రామాలయం వద్ద గురువారం శ్రీరామ నవమి సందర్భంగా సీతా రాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా మాదిరిగానే వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి దంపతులు గుర్రపు బగ్గీపై ముత్యాల తలంబ్రాలు, పట్టు పీతాంబరాలు తీసుకొచ్చి సమర్పించారు. కోటిరెడ్డి దంపతులు కల్యాణం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

- పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు సమీపంలోని శ్రీ పద్మసాయి ఆలయం వద్ద సీతారాముల కల్యాణం కన్నులపండువగా జరిగింది. అన్నసంతర్పన ఏర్పాటు చేశారు. స్థానిక హెచ్‌బీ కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొమ్మాది: వాడవాడలా పచ్చని పందిర్లు, మంగళవాయిద్యాలు, వేద మంత్రాల నడుమ శ్రీరామ నవమిని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కల్యాణం గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. బీచ్ రోడ్డు వారీజా ఆశ్రమంలో వేద పండితుల ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో, ఎండాడ, ఉప్పాడ, సోమన్నపాలెం, కొమ్మాది, మారికవలస ప్రాంతాల్లో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.

భీమునిపట్నం: స్థానిక నెహ్రూ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న వీరమట్టి రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. రొట్టెవీధి రామమందిరంతోపాటు, ఇతర ప్రాంత రామాలయాల్లోనూ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మత్స్యకారులు నివసించే బోయివీధి రామాలయం వద్ద అక్కడి గ్రామసమితి, పెద్దలు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఆనందపురం : మండలంలోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కనులపండువగా నిర్వహించారు. గుడిలోవ విజ్ఞాన్ విహార్‌లోని అభయాంజనేయ ఆలయంలో పండితులు మధిర వెంకట రమణ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన 40 మంది దంపతులచే సామూహికంగా సీతారాముల కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యం


బోయివీధిలో అన్న ప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

మూర్తి రామాయణ పారాయణం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి భజన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీ చైర్మన్ గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, దూసి రామకృష్ణారావు, జేవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. పెద్దిపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త బావిశెట్టి ప్రసాదరావు దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పాలాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కూరాకుల వెంకటేష్, పీవీ అప్పారావు, చెన్నా సత్యనారాయణ, కూరాకుల మురళి పాల్గొన్నారు.


చిట్టివలస రామాలయంలో ప్రత్యేక అలంకరణలో సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయ విగ్రహాలు

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణాపురం, కృష్ణాపురం కాలనీ, రెడ్డిపల్లి, పొట్నూరు, చిన్నాపురం, కోరాడ, పాత కొవ్వాడ, అనంతవరం, పెంట, మద్ది తదితర గ్రామాల్లో వైభవంగా సీతారాముల కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. మద్దిలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, తులసి లక్ష్మి, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.


భీమిలిలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న భక్తులు


గుడిలోవలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు


రెడ్డి సంతపేట రామాలయంలో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు


పెద్దిపాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


మద్ది రామాలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ కంటుబోతు రాంబాబు, భక్తులు

భీమిలి బీచ్‌కు కొత్త కళ


గోడపై ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన బొమ్మలు


భీమిలి బీచ్‌లో ఆకట్టుకుంటున్న బొమ్మలు


తీరంలో ఆకర్షణీయంగా ఫౌంటెయిన్

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లో, సమీపంలోని పురాతన డచ్ సమాధుల గోడలపై రంగులు, బొమ్మలు వేయడంతో కొత్త కళను సంతరించుకుని అందంగా దర్శనమిస్తున్నాయి. బీచ్ ఆధునికీకరణలో భాగంగా ఈ పనులు చేపట్టారు. 16వ శతాబ్దంలో డచ్‌వారు ఇక్కడ ఉన్నప్పుడు వారిలో మరణించిన ప్రముఖులు, ఉద్యోగుల సమాధులు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వాటిని పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పరిరక్షిస్తున్నారు. ఇప్పుడు సమాధుల లోపల భాగంలో శుభ్రం చేయడంతోపాటు ఇరువైపులా గోడలపై ఆకర్షణీయమైన బొమ్మలు వేయడంతో ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా బీచ్‌లోని బుద్ధుని బొమ్మలు, ఫౌంటెయిన్‌కు కూడా అవసరమైన మరమ్మతులు చేపట్టి రంగులు వేయడంతో ఆకర్షణీయంగా మారాయి. దీంతో ఇక్కడకు వస్తున్న సందర్శకులు వీటిని ఆసక్తిగా తిలకించడంతోపాటు సరదాగా ఫొటోలు తీసుకుంటున్నారు.

ప్రమాదాలకు నిలయంగా కూడలి

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో రెండు రోడ్లు కలిసే కూడలి (జంక్షన్) ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా ఉంది. విశాఖ నుంచి భీమిలికి వచ్చే బీచ్‌రోడ్డు భీమిలి దగ్గరలో ఏపీ బాలికల గురుకుల పాఠశాల దాటిన తర్వాత ఎడమ వైపునకు నేరెళ్లవలస కాలనీ, ఎగువపేటమీదుగా ఊరిలోకి వెళ్లడానికి ఒక రోడ్డు ఉంది. అలాగే నేరుగా జిల్లా పరిషత్ వసతి గృహం, బోయివీధి మీదుగా బీచ్ లైట్‌హౌస్ వద్దకు వెళ్లే రోడ్డు ఉంది. ఇలా ఇక్కడ రెండు రోడ్లుగా విడిపోయే ప్రాంతం ఎంతో ప్రమాదకరంగా ఉంది. ఒకేసారి రెండు వైపుల నుంచి వాహనాలు అతివేగంగా దూసుకుని వస్తుంటాయి. దీంతో పలు సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతుండగా చాలా మంది గాయపడుతున్నారు. అదృష్టవశాత్తు ఇంతవరకు ప్రాణనష్టం జరగలేదు. ఇంత ప్రమాదకరంగా ఉన్న ఈ ప్రాంతంలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు.


బీచ్‌రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న కూడలి

కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో ఏ క్షణంలో ప్రమాదాలు జరుగుతాయోనన్న ఆందోళన నెలకొంది. ఇక రాత్రి వేళల్లో పరిస్థితి మరింత భయానకంగా ఉంటోంది. సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్‌బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

గాంధీ బజార్‌కు విశేష స్పందన


చెక్కతో తయారు చేసిన అందమైన బొమ్మలు

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో ఏర్పాటు చేసిన గాంధీ బజార్ లేపాక్షి హస్తకళల చేనేత ఉత్పత్తుల ఎగ్జిబిసన్ కమ్ స్టాల్స్ వినియోగదారులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఈ స్టాల్స్‌లో మేక తోలుపై వేసిన అందమైన పెయింటింగ్స్, ఏటికొప్పాక చెక్కబొమ్మలు, గోగు నార సంచులు, బ్యాగులు, చెక్క ఊయల బొమ్మలు, చేనేత వస్త్రాలు లభిస్తున్నాయి. స్టాల్స్ నిర్వాహకులకు అవసరమైన సదుపాయాలు కల్పించామని స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథ రెడ్డి తెలిపారు.


తాటి ఆకులతో తయారు చేసిన ఉత్పత్తులు

ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలపై తనిఖీలు శూన్యం

నాణ్యత లేని ఆహారం తింటూ రోగాలపాలవుతున్న జనం

తగరపువలస: తగరపువలస కేంద్రంగా ఫాస్ట్‌ఫుడ్ పదార్థాల తయారీ కేంద్రాల్లో నాణ్యత లోపిస్తోంది. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో నూడిల్స్, పానీపూరీ, జిలేబీ, సమోసా, పరోటా, చాట్, బొబ్బట్లు తయారుచేసే చోట అపరిశుభ్ర వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక మాంసాహార వస్తువులతో తయారు చేసే స్టాల్స్ అనారోగ్య కేంద్రాలుగా మారుతున్నాయి. నిల్వ ఉంచిన చేపలు, చికెన్, పీతలు, రొయ్యలు ఉపయోగించి తయారు చేసే వేపుళ్లు, పకోడీలు రోత పుట్టిస్తున్నాయి. తయారు చేసే ప్రదేశంలోనే కాకుండా అందులో వినియోగించే నూనెలు, మసాలాలు, జొన్నపిండి తదితర పదార్థాలు వాడిందే మళ్లీ మళ్లీ వాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారు. ముందురోజు మిగిలిపోయిన పదార్థాలను మరుసటి రోజు రీసైక్లింగ్ చేస్తున్నారు. కోళ్ల ఫారాల నుంచి కళ్లిపోయిన గుడ్లు, చనిపోయిన కోళ్లను చవగ్గా తీసుకొచ్చి ఇళ్ల వద్ద నిల్వ చేస్తున్నారు. వీటికే రంగులు, మసాలాలు అద్ది సొమ్ము చేసుకుంటున్నారు. అంబేడ్కర్ కూడలికి చుట్టూ ఉన్న ఫాస్ట్‌ఫుడ్ విక్రయ కేంద్రాలను చూస్తే అక్కడి వాతావరణం జుగుప్సాకరంగా ఉంటుంది. మల, మూత్ర విసర్జనలు జరిగే చుట్టూ దుకాణాలు, తోపుడు బండ్ల వద్ద విద్యుద్దీప కాంతులలో మభ్యపెట్టి మరీ విక్రయిస్తున్నారు. ఆహార పదార్థాలు విక్రయిస్తున్న దుకాణాలే కాకుండా వారి ఇళ్ల వద్ద పెద్ద సంఖ్యలో పాడైన ఆహార పదార్థాలు ఫ్రిడ్జ్‌లలో గడ్డకట్టుకుపోతున్నాయి. ఇంత అనారోగ్య వాతావరణంలో ఆహార పదార్థాలు విక్రయిస్తున్నా ఇప్పటి వరకు ఫుడ్ సేఫ్టీ, ఆరోగ్య విభాగాల సిబ్బంది తనిఖీలు నిర్వహించిన పాపాన పోలేదు. వినియోగదారులు మాత్రం తెలిసో తెలియకో తమ జిహ్వాచాపల్యంతో అపరిశుభ్ర వాతావరణం కూడా పట్టించుకుకోండా కొనుగోలు చేసి తింటూ రోగాల బారిన పడుతున్నారు. ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఇప్పటికే జీవీఎంసీ అధికారులకు పలు ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా ప్రజారోగ్యం దృష్ట్యా బహిరంగ ప్రదేశాలు, తోపుడుబండ్లపై విక్రయిస్తున్న పదార్థాల నాణ్యతపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

చిట్టివలస హైస్కూల్ ఆవరణలో పశువుల తిష్ట


చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులపైకి వస్తున్న పశువులు


సైకిల్ స్టాండ్ వద్ద తిష్టవేసిన ఆవు

ఆందోళన చెందుతున్న విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌కు పూర్తి స్థాయిలో ప్రహరీ లేకపోవడంతో పశువులు లోపలికి ప్రవేశించి విద్యార్థులపై కొమ్ములు విసురుతున్నాయి. దీంతో విద్యార్థులు వాటితో దినదినగండంగా ఆందోళన చెందుతున్నారు. అప్రమత్తంగా లేకపోతే ఎక్కడ పొడుస్తాయోనని వాపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో పదుల సంఖ్యలో పశువులు ప్రవేశించి విద్యార్థుల మీదకి వస్తున్నాయి. ఆటస్థలాన్ని సైతం ఆక్రమించుకుని ఆటలు సాగనివ్వడం లేదు. హైస్కూల్ ఆవరణలోకి పశువులు రాకుండా ప్రహరీ నిర్మించడానికి ఇటీవల దివీస్ లేబొరేటరీ యాజమాన్యం ముందుకు వచ్చింది. పాత ప్రహరీ కాకుండా అక్కడి నుంచి ఎనిమిది అడుగుల వెడల్పు, 150 అడుగుల పొడవునా స్థలాన్ని బయటి వ్యక్తులకు వదిలేయాలనుకున్న కొందరి ఉద్దేశ్యాన్ని పూర్వ విద్యార్థులు, జ్యూట్ కార్మికులు తిప్పికొట్టారు. పాత ప్రహరీనే పునరుద్ధరించి హైస్కూల్ స్థలం ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లకుండా, అలాగే పశువుల బెడద తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా హైస్కూల్ స్థలం కబ్జాకు గురికాకుండా అడ్డు తగులుతున్న పూర్వ విద్యార్థులకు బెదిరింపులు మొదలయ్యాయి. మరోవైపు పూర్వ విద్యార్థులను ప్రలోభపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ హైస్కూల్ స్థలం పరిరక్షణకు 60 ఏళ్ల క్రితం నుంచి ఉన్న విద్యార్థులు మద్దతు కూడగడుతున్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన


పిడికిట తలంబ్రాలు పెళ్లి కూతురు... పాటకు నృత్యం చేస్తున్న చిన్నారులు


శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

తగరపువలస: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా జీవీఎంసీ రెండో వార్డు జీరుపేట రామాలయం వద్ద గురువారం చిట్టివలస సుఖీభవ కాలనీకి చెందిన 'భారతీయ నటరాజ నృత్య ప్రదర్శన' చిన్నారులు శాస్త్రీయ, క్లాసికల్ నృత్యాలకు అభినయం చేశారు. కె.దివ్యకుమారి ఆధ్వర్యంలో 32 మంది చిన్నారులు గణపతి స్తోత్రం, ముకుందా ముకుందా, అన్నమయ్య కీర్తనలకు చేసిన నృత్యం స్థానికులను అలరించింది. వీరి అభినయానికి స్థానికులు చప్పట్లతో ప్రోత్సహించారు. కార్యక్రమానికి చిల్ల భాస్కరరెడ్డి, నీలాపు శంకరరెడ్డి, జీరు సురేష్‌రెడ్డి తదితరులు సహాయ సహకారాలు అందించగా చిన్నారులను మెమెంటోలతో ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో 3 వేల మందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలకు స్థానిక ఆలయ కమిటీ ప్రతినిధులు సహాయ సహకారాలు అందించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: శ్రీరామ నవమిని పురస్కరించుకుని శిల్పారామంలో గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. విజయనగరం జిల్లాకు చెందిన శ్రీ విజయ కళాకేంద్రం విద్యార్థుల నృత్య ప్రదర్శన హైలెట్‌గా నిలిచింది. కళాకారులు గాయత్రి, పుష్పలత, చంద్రిక, సాయి సుదిష్ణ, జాహ్నవి దుర్గా, హనీష, నిత్య, దీపిక, ఉజ్వల తదితరులు పాల్గొనగా కల్పణ రమణ నృత్య దర్శకత్వం వహించారు. అంతకు ముందు స్థానిక పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా సందర్శకులకు బెల్లం పానకం, వడపప్పు పంపిణీ చేశారు.

జిందాల్ ప్లాంట్ పరిశీలన


జిందాల్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జి - 20 ప్రతినిధులు

మధురవాడ: మధురవాడలో గల జిందాల్ గ్రూప్ వేస్టు టూ ఎనర్జీ ప్లాంట్‌ను గురువారం జి - 20 ప్రతినిధి బృందం సందర్శించింది. 20 దేశాల ప్రతినిధులు జిందాల్ గ్రూప్ మేనేజ్‌మెంట్‌తో మౌలిక సదుపాయాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్మిన్ జిందాల్ మాట్లాడుతూ యాక్సిసబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రవాణా, జీవన నాణ్యతను ప్రతినిధులకు వివరించారు. వేస్టు టు ఎనర్జీ రీసైక్లింగ్ ఎనర్జీ ప్లాంట్ వ్యర్థాల నుంచి రోజుకు 15 ఎమ్‌డబ్ల్యూ శక్తి ఉత్పత్తి చేస్తుందని తెలిపారు.